ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 25.07.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 2 లక్షల 91 వేల 159 కోట్ల రూపాయలతో తెలంగాణ వార్షిక బడ్జెట్ ను ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ రోజు శాసన సభలో ప్రవేశపెట్టారు.
2. బడ్జెట్ లో కీలక రంగాలైన వ్యవసాయం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, నీటి పారుదల రంగాలకు అధిక నిధులు కేటాయించారు.
3. దుబారా తగ్గించి ఆర్థిక క్రమ శిక్షణతో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని భట్టి విక్రమార్క చెప్పారు.
4. భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి వరద మళ్లీ పెరుగుతోంది.

----------

బడ్జెట్

ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరానికి మొత్తం 2 లక్షల 91 వేల 159 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో వార్షిక బడ్జెట్ ను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభకు సమర్పించారు. ఇందులో 2 లక్షల 20 వేల 945 కోట్ల రూపాయలను రెవెన్యూ వ్యయంగా, 33 వేల 487 కోట్ల రూపాయలను మూలధన వ్యయంగా ప్రతిపాదించారు. . కాగా గత ఏడాది డిశంబర్ లో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడ్డ తర్వాత ప్రవేశపెట్టిన పూర్తి స్థాయి మొదటి బడ్జెట్ ఇదే. ఈ ఏఢాది ఫిబ్రవరిలో 2 లక్షల 75 వేల కోట్ల

రూపాయల అంచనా వ్యయంతో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విషయం తెలిసిందే.

రాష్ట్రం అప్పులు గత పదేళ్ళలో దాదాపు 75 వేల కోట్ల నుంచి 6 లక్షల 71 వేల కోట్ల రూపాయలకు పైగా పెరిగిందని ఆర్థికమంత్రి చెప్పారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక 35 వేల కోట్ల రూపాయలను రుణాలను తీసుకున్నాక, గత ప్రభుత్వం తీసుకున్న రుణాలలో 42 వేల కోట్ల రూపాయల బకాయిలను చెల్లించినట్లు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా, సంక్షేమాన్ని విస్మరించలేదని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం ఏర్పడ్డాక 34 వేల 579 కోట్ల రూపాయలను వివిధ సంక్షేమ పథకాలకు ఖర్చు చేసినట్లు, దానితోపాటు 19వేల కోట్ల రూపాయలకు పైగా మూలధన వ్యయంగా ఖర్చు చేసినట్లు వివరించారు. రాష్ట్రం గత ఆర్థిక సంవత్సరానికి 7.4 శాతం వృద్ధిని నమోదు చేసిందని, ఇది జాతీయ స్థాయి కంటే స్వలంగా తక్కువని పేర్కొన్నారు. రాష్ట్ర స్థూల స్థాయి దేశీయ ఉత్పత్తి - జి ఎస్ డి పీ ప్రస్తుత ధరల ప్రకారం 14 లక్షల 63 వేల 963 కోట్ల రూపాయలుగా ఉందని, గత ఏడాదితో పోలిస్తే 11.9 శాతం వృద్ధి నమోదు చేసిందని, ఇది జాతీయ స్థాయి కంటే ఎక్కువ వుందని చెప్పారు.

**సౌండ్ బైట్ ....**

ఆదాయ వృద్ధితో పోలిస్తే పెరిగిన రుణాల వల్ల ఖర్చుల కోసం ప్రభుత్వం రుణాలపై ఆధారపడిందని, ఈ పరిస్థితి ఆర్థిక సుస్థిరతకు ప్రమాదమని, పేర్కొన్న ఆర్థిక మంత్రి కఠోర ఆర్థిక సంస్కరణలు అమలు చేయని పక్షంలో రాష్ట్ర ఆర్థిక స్వస్థత ప్రమాదంలో పడుతుందని చెప్పారు. దీనిని నివారించడానికి ఆర్థిక వ్యయాన్ని, ఆదాయాన్ని సమన్వయపరిచే చర్యలు తీసుకోవలసిని అవసరం ఉందని స్పష్టం చేశారు.

**సౌండ్ బైట్ ....**

గత ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలు, నాణ్యత లేని పనుల వల్ల సాగునీటి ప్రాజెక్టులు, రాష్ట్రం వాటా నీళ్ళను రాష్ట్ర ప్రయోజనాలకు పూర్తిగా వినియోగించలేదని పేర్కొన్నారు. నీటి పారుదల

రంగంలో 6 ప్రాజెక్టులను ఈ ఆర్థిక సంవత్సరంలోనూ, 12 ప్రాజెక్టులను వచ్చే ఆర్థిక సంవత్సరానికి పూర్తి చేయనున్నట్లు, 22 వేల 301 కోట్ల రూపాయలను ఈ రంగానికి కేటాయిస్తున్నట్లు ప్రకటించారు.

తలసరి ఆదాయం జాతీయ స్థాయితో పోలిస్తే స్వల్పంగా తగ్గిందని పేర్కొన్న ఆర్థికమంత్రి వ్యవసాయం, అనుబంధ రంగాలలో స్థూల విలువ 4 శాతం పెరిగిందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో సమగ్ర రహదారుల పాలసీని తయారుచేస్తున్నట్లు ప్రకటించిన ఆర్థికమంత్రి ప్రతి గ్రామ పంచాయతీ నుంచి మండలి కేంద్రానికి కనీసం ఒక తారు రోడ్డును, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధానికి హైవే నిర్మాణాన్ని ఈ విధానం కింద నిర్మించనున్నట్లు చెప్పారు. రోడ్లు, భవనాల శాఖకు 5 వేల 790 కోట్ల రూపాయలను ప్రతిపాదించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 3 నేర చట్టాలపై అవగాహన కల్పించేందుకు పోలీసు సిబ్బందికి శిక్షణా తరగతులను నిర్వహించామని, పోలీసు వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో విశ్వవిద్యాలయాలకు పూర్తి స్థాయి వీసీలను నియమించనున్నట్లు చెప్పిన ఆర్థికమంత్రి విద్యా రంగానికి 21 వేల 292 కోట్ల రూపాయలను ప్రతిపాదించారు.

పబ్లిక్, ప్రయివేట్ భాగస్వామ్యంతో 65 ప్రభుత్వ ఐటిఐలను నైపుణ్య కేంద్రాలుగా మారుస్తున్నట్లు, ఇందులో 5 వేల 8 వందల మందికి పైగా విద్యార్థులకు దీర్ఘకాలిక శిక్షణా కోర్సులను, 31 వేల మందికిపైగా స్వల్పకాల కోర్సులను అందిస్తున్నట్లు, ఇందుకు మొత్తం 2 వేల 324 కోట్ల రూపాయలను ఖర్చు చేయనున్నట్లు చెప్పారు.

పరిశ్రమల శాఖకు 2 వేల 762 కోట్లను కేటాయించిన ఆర్థికమంత్రి రాష్ట్రంలో ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హాండ్ లూమ్ టెక్నాలజీ ఏర్పాటు విషయాన్ని కేంద్ర ప్రభుత్వంతో సంప్రదిస్తున్నట్లు ప్రకటించారు.

పంట రుణ మాఫీ కోసం 31వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం సమీకరిస్తోందని, ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అర్హులైన రైతులకు మాత్రమే అమలు చేసేలా ఏటా ఎకరాని 15వేల రూపాయల రైతు భరోసా కార్యక్రమం కోసం విధివిధానాలను శాసనసభలో చర్చించిన అనంతరం ఖరారు చేస్తామని పేర్కొన్నారు. రైతు కూలీల జీవన

స్థితిగతులను మెరుగుపరచడానికి ఏటా 12 వేల కోట్ల రూపాయలు అందించే కార్యక్రమాన్ని ఈ ఏడాది ప్రారంభించనున్నట్లు చెప్పారు.

**సౌండ్ బైట్ ...**

సన్న రకం వరి ధాన్యాలను ప్రోత్సహించడానికి 33 రకాల వరి ధాన్యాలపై రైతుకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ను చెల్లించడానికి నిర్ణయించినట్లు చెప్పిన ఆర్థికమంత్రి 72 వేల 659 కోట్ల రూపాయలను వ్యవసాయ రంగానికి కేటాయించారు.
తోట పంటల కోసం 737 కోట్ల రూపాయల వ్యయాన్ని ప్రతిపాదించారు.
గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ పంపిణీ పథకం కోసం 2 వేల 418 కోట్ల రూపాయలను కేటాయించినట్లు వెల్లడించారు.
ప్రజా పంపిణీ విభాగానికి 3 వేల 836 కోట్ల రూపాయలు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు 29 వేల 816 కోట్ల రూపాయలను కేటాయించారు. జీహెచ్ఎంసీ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన కోసం 3 వేల కోట్ల రూపాయల పైగా నిధులను హెచ్ఎండీఏ మౌలిక సదుపాయాల కోసం 500 కోట్ల రూపాయలను, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకోసం 15 వందల కోట్ల రూపాయలు, రీజినల్ రింగ్ రోడ్డు చుట్టపుక్కల ప్రాంతాల అభివృద్ధికి ఈ బడ్జెట్ లో 1525 కోట్ల రూపాయలను మంత్రి ప్రతిపాదించారు.
మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖకు 2 వేల 736 కోట్ల రూపాయలు, షెడ్యేల్డు కులాల సంక్షేమం కోసం 33 వేల 124 కోట్ల రూపాయలు, షెడ్యూల్డు తెగల సంక్షేమం కోసం 17 వేల 56 కోట్ల రూపాయల వ్యయాన్ని ప్రతిపాదించారు. మైనారిటీ సంక్షేమం కోసం 3 వేల 3 కోట్ల రూపాయలను ప్రతిపాదించిన ఆర్థికమంత్రి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖకు 9 వేల 200 కోట్ల రూపాయల కేటాయింపులను ప్రకటించారు.
వైద్య, ఆరోగ్య శాఖకు 11 వేల 468 కోట్ల రూపాయలను, విద్యుత్ రంగాని కి 16 వేల 410 కోట్ల రూపాయలను, అడవులు, పర్యావరణ శాఖకు ఒక వెయ్యి 64 కోట్ల రూపాయల కేటాయింపులను ప్రకటించారు.

బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఈరోజు ప్రతిపక్ష నాయకుడి హోదాలో శాసనసభకు హాజరయ్యారు. కాగా శాసన మండలిలో మంత్రి శ్రీధర్ బాబు బడ్జెట్ ను సమర్పించారు.

\- ఎంఎస్ఎల్

**భద్రాచలం**

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మళ్లీ పెరుగుతోంది. నిన్న రాత్రి వరకు 45 అడుగులకు తగ్గిన గోదావరి నీటిమట్టం మళ్లీ క్రమంగా పెరుగుతూ ఈ ఉదయం రెండున్నర అడుగులు పెరిగి 47.7 అడుగులకు చేరింది. ప్రస్తుతం మొదటి ప్రమాద హెచ్చరిక అమలులో ఉండగా.. 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. నదీ ప్రవాహం పెరగడంతో స్నాన ఘట్టాలు, కళ్యాణకట్ట ఇంకా వరదనీటిలోనే ఉన్నాయి. పర్ణశాలలోని సీతమ్మ నార చీరల ప్రాంతం కూడా ఇంకా వరద నీటిలోనే మునిగి ఉంది. అక్కడక్కడ వంతెనల పై నీరు నిల్వ ఉండడంతో భద్రాచలంతో విలీన మండలాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు తాలిపేరు, కిన్నెరసాని ప్రాజెక్టుల వద్ద కూడా వరద ఉధృతి కొనసాగుతోంది.

(PTC)

**జూరాల**

గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద పోటెత్తింది. దీంతో అధికారులు ప్రాజెక్టు 42 గేట్లు ఎత్తివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 2.06 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా జలాశయం నుంచి 1.97 లక్షల క్యూక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటి మట్టం 318.51 మీటర్లు కాగా ప్రస్తుతం 316.71 మీటర్లు ఉంది. ప్రాజెక్టులో 9.65 టీఎంసీల నీటి నిల్వకుగాను ప్రస్తుతం 6.23 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

(DESK)

**పంట నష్టం**

మంచిర్యాల జిల్లాలో గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు 4 వేల 201 మంది రైతులు 7 వేల 497 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు అధికారులు గుర్తించారు.ఎగువ కురుస్తున్న

వర్షాలకు  ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవ హిస్తుండడంతో నది తీర ప్రాంత గ్రామాల రైతుల పంటలు నీటమునిగాయి.

(PTC)